# స్వయంవరం

కాఫీతాగి స్నానంచేసి అలా కుర్చీలో కూర్చున్నానో లేదో చిట్టిగాణ్ణి తీసుకొనివచ్చింది మా శ్రీమతి. వయ్యారంగా అలా అడుగులేస్తూ వొస్తూవున్న శ్రీమతికి ముందు ఒకదానికంటె ఇంకొకటి పోటీపడుతూ వొరుచుకుని వస్తూన్న రెండు గాలి కెరటాలు నన్నుక్కిరిబిక్కిరి చేశాయి. నేను అలా ఉండగానే వొచ్చేసింది అర్ధాంగి. నాకోసమని కాలం ఆగుతుందా ?

"ఏమండీ!" పిలుపువిని ఉలిక్కిపడ్డాను. "ఏం అలా ఉలిక్కిపడుతున్నారు" అడిగింది ప్రేమగా. "నిన్నుగురించే ఆలోచిస్తున్నాను" ఏమిటండీ నన్నుగురించి అంత దీర్ఘంగా ఆలోచించవలసిన అవసరం?" "సరేగాని నువ్వు తెలివిగల దానవు అవునాగాదా?" నా తెలివి మీదగ్గర పనికిరాదు. చిన్నప్పుడు వూళ్ళోవాళ్ళు ఎంతపొగిడేవారు నన్ను?" "ఎందుకో"

"ఎందుకేమిటి? పనిపాటల్లోగాని, ఆటపాటల్లోగాని ఏ విషయంలోనైనా గానీయండి! ముందు నన్ను చెప్పి ఇంకొకర్ని చెప్పేవారు. బేరసారాలు చెయ్యడంలో ఇప్పటికీ మా అమ్మ నాన్నే సలహా అడుగుతుంది." "రైటో! నేనూ ఒప్పుకుంటాను మరి నిన్ను గురించి నేనుఆలోచించేదేమిటో చెప్పనా?" 'ఊ'

ఇంత తెలివిగల నీతో ఇన్నాళ్ళనుంచీ కాపరం చేస్తున్న ఇహ చేయబోతున్న నీమొగుడెంత ఘట్టివాడై ఉండాలా అని ధర్మసందేహం వచ్చింది. దాన్ని గురించి ఇప్పుడు నేను ఆలోచిస్తూంట." "సంతోషించాంలెండి మీ తెలివికి. చిన్నదానికీ పెద్దదానికీ నేనుండటంవల్ల మేమీ కనబపడటం లేదు. అదీ చివరికి మీ ప్రజ్ఞే అని చెప్పుకోవడంకూడానా?" "ఏమిటో!" "నువ్వు నాకు అర్ధాంగివేనా?" "అయ్యో! రాత! అర్ధాంగిని కాక అమ్మవారి ననుకుంటున్నారా?" "ఇంకొకటి" "వూ చెప్పండి." నాకు "అర్ధాంగి" అర్ధం కొంచెం చెపుదూ? "ఇంత మాత్రం తెలియదటండీ! అర్ధాంగి అంటే భర్త కష్టసుఖాల్లో సమభాగం పొందుతూ మానసికంగాకూడా అతని మనస్సులో సగంభాగం ఆక్రమించాలె." "అంతేనంటానా?" "నా కింత వరకు తెలుసు." "అయితే నువ్వు ప్రజ్ఞ చూపించి ఒక ఘన కార్యం సాధించాననుకో! ఆ కీర్తిలో సగపాలు నాకు రావాలిగదా! న్యాయంగా. కనక అప్పుడు నామీద గొప్ప తనం ఏమున్నది." "సంతోషించాంలెండి మీ ప్లీడరుబుద్ధి."

"అయ్యో! నా తెలివి తగలడ! ఇంతకీ ఏదో చెప్పబోయి ఇంతసేపూ మాటలసందట్లో మరచిపోయాను."

“చాలుచాల్లే నీ తెలివెందుకు తగలడటం ! అందులో నాకు సగపాలు ఉన్నదన్న సంగతి మరచిపోతున్నావా.”

“చాల్లెండి. పనికిమాలిన కబుర్లు. ఇంతకీ ఏమిటిచెప్తాం. జ్ఞాపక మొచ్చిందండీ, రేపు మన చిట్టిగాడిమేనమామ వస్తున్నాడు.

“ఆ! నిజంచే? అటులయిన నా నెమ్మనంబు యెంతయు సంతసించె.” “సరేలెండి అలా నాటకంలోలాగ ఏమిటది ? వాడి మాట వినగానే. నాటకంలో హీరో అనుకుంటారు.”

కోపంతో మూతిముడిచింది. అది అందరూ అనుకునేట్టు అంత అందంగా లేదుగాని నాకుమాత్రం దాన్ని చూసే సరికి నవ్వువచ్చింది.

“నాకు వాడిమీదవున్న సహజవాత్సల్యంవలన ఆలా మాటలు వసాయి. అంతమాత్రానికి నువ్వు కోపం తెచ్చుకొని అలా హీరోయిన్ ఫోజు పెట్టడం ఎందుకో!” అన్నాను. “హీరోయిన్” అని అతనిని పిల్వడంవల్లనో, మరి ఏమిటో గాని ఆ కోపం పోయింది. “ఇంతకీ నేను చెప్పబోయే దేమిటంటే— రేపుసాయంత్రం వాడు బండిదిగుతాడు. చాలానాళ్ళకు వొస్తున్నాడు. మనం స్టేషన్ కివెళ్ళి వాడిని తీసుకొస్తే బావుండదూ ?”

“ఎందుకు బావుండదూ. కానీ రేపు ఆఫీసులో పనెక్కువైతే నా కాలస్యం అవుతుందేమోనని ఆలోచిస్తున్నాను” “ఏమండీ ఈ సక్కజీతులూ మీరూనూ. రేపు ఆదివారమని నాకు ఆమాత్రం తెలీదంటారా.” “చచ్చాంపో ! నేను ఆ

సంగతి మరచిపోయాసుమా! ఇంతకీ నా ప్రియమైన బావ మరిది ఇంకా ఏమని వ్రాశాడు.'' "మిమ్మల్ని అడిగానని మరీ మరీ రాశాడు'' "అవును. వాడు చాలా మంచివాడు. నాకు తెలుసు. ఇంతకీ అంత అర్జంటుగా రావటానికి కారణమేమిటో" "రామ రామ, ఏమీ తెలియని పిల్లాడిలా అలా మాట్లాడతారేమండీ! ఇప్పుడు వాడి కెన్నేళ్ళుంటారు?'' ఇరవై ఒకటి అటోయిటో ఉండొచ్చు.' "అదేమిటి!'' ఇకే అనండి. ఇంతకీ వాడికి పెళ్ళికి ఇదీ మంచివయస్సు అవునా కాదా?'' యెందుకుకాదూ. "ఎండ్ ఆఫ్ టీన్స్.'' ప్రశస్తమైనదని మనవాళ్లు అంటారు.'' "వాడికి తగిన సంబంధం చూచి కుదర్చకపోగా వాడంతటవాడే పెళ్ళికి తయారైవస్తుంటే అలా పట్టించుకోకుండా యేమిటది. కర్మగాకపోతే పైగా నవ్వుకూడానూ" కోపంతో ఆవిడచెంపలు కెంపెక్కాయ్.

"ఏమేవ్! వాడికి విరాటుడువంటి బావవున్నాడు. నువ్వేం బెంగపడనవసరంలేదు." "అయితే వాడు..." "కీచకుడు" రామరామ ఎందుకండీ వాణ్ణి అలా ఆడిపోస్తారు. వాడెంత మంచివాడు. ఈరోజుల్లో మంచివాళ్ళకి మనుగడ లేదుగదా! "సరే లేవె! ప్రతీదానికీ గొడవ. ఇంతకీ పిల్ల నిశ్చయమైందా" "మళ్ళీ మొదటికి వొచ్చారూ? వాడికి మీవలె కట్నాలూ అవీ అక్కర్లేదు. అంతో ఇంతో ప్రతీ నెలా సంపాదిస్తున్నాడు. మంచి గుణవంతురాలయిన పిల్లని చూసి కట్నం లేకుండా ఆదర్శ వివాహం చేసుకోవాలని మావాడి సంకల్పం." "ఇంకేం భేషుగ్గావుంది. ఆ పెళ్ళికి

పెత్తనం వహించడానికి వాడికి ప్రియమైన బావ యెప్పుడూ సిద్ధమే. ఇంతకీ మన ఫోటో లప్పుడు పేపర్లో పడతాయంటావా?" ఎంతసేపూ పేరుకోసం పాకులాటేగాని కాస్తవాడు బాగుపడుతోంటే చూసి సంతోషించడంలేదు గదా!"

"చాల్లేవే! వాడు బాగుపడాలని వాళ్ళక్క కుండదంటావా? ఇహ బావంటావా? అక్క తర్వాతేగదా! ఇంతకీ రేపు తప్పదంటావా "మళ్ళీ చెప్పాలా ఇంకా!" "సరే తప్పుతుందా మరి."

♦ ♦ ♦

అనుకున్నట్లుగానే ఆనాడు నేనూ, శ్రీమతి, చిట్టిగాడూ ముగ్గురంకలిసి స్టేషనుకు వెళ్ళాము. జనాన్ని బళ్ళనీ చూసి చిట్టిగాడి కేరింతలు అంతులేకుండా వున్నాయి. శ్రీమతి చిరునవ్వులు చిందిస్తోంటే గంభీరాకారుడనై ప్లాట్‌ఫారమ్‌మీాద నిలబడున్నాను. కొన్ని నిముషాలకి సిగ్నల్ యిచ్చారు. దూరాన పొగ కనిపించింది. శ్రీమతి తదేకంగా ఆ వైపు చూస్తోంది. మరి కాస్సేపటికి బండి వచ్చింది. నేను అన్ని పెట్టెలూ దూరంగా నిలబడి పరికిస్తున్నాను. మా బావమరిది కనిపిస్తాడేమోనని. ఏడీ యెక్కడా తగలడేం చెప్మా? తిరుగుతూ వుంటే కనబడడం లేదు. తిరిగి వొచ్చేస్తోందే బుజ్జిగాణ్ణెత్తుకొని. ఎవరో మాట్లాడుతున్నారు శ్రీమతితో.

ట్వీడ్ పాంటూ బుష్‌కోటూ వేసుకున్నాడు. ఎవరు చెప్మా? కింద సూటుకేసు. చేతికి వాచీ. ఫ్రెంచికట్ మీాసాలు

బ్లాక్ గ్లాస్డ్ స్పెక్టికిల్స్. ఎవరా అని సంశయిస్తూంటే "ఏం వోయ్! బావా! అని అమాంతం కౌగిలించుకున్నాడు." ఉక్కిరిబిక్కిరయాను. "ఎవరూ మదీయ అనుంగు బావమఱది భానుమూర్తియేనా? ఎంతమార్పు? ఎంతమార్పు?"

"ఏంవోయ్! బావా! అలా కిందనుంచి పైకిచూస్తావ్! నేను నేనోయ్ అన్నాడు మావాడు వుత్సాహంగా. "ఓహో బావకి యీ మధ్య పరధ్యానం యెక్కువైందిరా!" అంటోంది శ్రీమతి. క్షణకాలం తెప్పరిల్లి "ఏరా! భానూ నువ్వు నువ్వేనా?" అన్నాను. "ఆ! బావా? నేను నేనేనోయ్!" అన్నాడు వాడు ఫ్రెంచికట్ క్రింద పెదవి కదిలిస్తూ అదో ఫేసనుగా. "ఇదేమిటీవేషం? ఈ జాకెటూ? ఇదీ ఆ... ఏమి టీదంతా? ఆ ఆంధ్రత్వం, ఆ పంచే, లాల్చీ, ఖద్దరూ. ఆ? అన్ని యేం చేశావోయ్?" నోరు తెరుచుకుని అడిగాను ఆశ్చర్యం ముప్పిరిగొనగా.

"ఏం చేశానా? తీసికెళ్ళి ఆ "బే ఆఫ్ బెంగాల్"లో వేశాను. "అరి అప్రాచ్యుడా?"

"అప్రాచ్యుడికే గౌరవం యెక్కువ ఈ రోజుల్లో. ఇంతవరకూ నన్నెవరూ ఆ మాటనలేదు. అలా అని నన్ను గౌరవించిన నీకు థాంక్స్ వోయ్ బావా" అన్నాడు భుజంమీద చరుస్తూ. ఇక్కడ దేనికి బాతాఖానీ అని శ్రీమతి ఫైనల్ ఆర్డర్స్ యివ్వటంతో యింటికి పోయాము.

◆ ◆ ◆

ఒక వారం రోజులు మా బావమరిది కులాసాగా గడిపేశాడు. ఈ వారం రోజులూ కలకత్తా కబుర్లతోటి, విశేషాలతోటి గడిచిపోయింది. ఈ లోగా మా వాడు కొంచెం రెస్టు తీసుకున్నాడనుకుంటా. బీచి షికార్లతో బుర్ర తిరిగిన మా వాడు యెనిమిదోనాడు "హాలీవుడ్ ఆర్ బస్ట్" వెళదాం రావోయ్" అన్నాడు. "నాయనా! నాకు యింగ్లీషు సినిమా యిష్టంలేదు. అదీగాక యివాళ ఆఫీసులో చచ్చేటంత వర్కున్నది. అని వాడికి నచ్చజెప్పేటప్పటికి తల ప్రాణం తోకకొచ్చింది. "సరే లేవోయ్ రేపు సిస్టర్తో కలిసి తెలుగు పిక్చర్ కెడదాం" అని తనుమాత్రం వెళ్ళిపోయాడు. ఆనాటికి ఐదోవాడు కామోసు నేను కాఫీ తాగ కూర్చోగానే తయారయాడు "బావా మాట అని." "ఏమిటోయ్" నీతో ఒక అత్యావసర విషయంగురించి మాట్లాడాలి. "ఏమిటో" "నా లైఫ్ క్వశ్చన్ డిటర్మిన్ చేసుకుందామని పెద్దవాళ్ళయిన మీ సలహా తీసుకోవద్దూ! అందుకని సిస్టర్ని కూడా పిలిచాను. కాస్సేపటికి శ్రీమతి కూడా వొచ్చి కూర్చుంది బుజ్జిగాడితో.

♦ ♦ ♦

ఆ. ఏం లేదువోయ్! మొన్న నేను సినిమా కెళ్ళటానికి బయులుదేరానా! తరవాతేం జరిగిందంటే ... స్నానం చేసి బయులుదేరానా కనుక తృప్తిగా ఉల్లాసంగా తను చల్లటి సముద్రపు గాలికి యిస్త్రీ చేసిన బుష్కోటు కాలరు

మెడవద్ద మెల్లగా వూగుతోంది. పాలిష్ చేసిన బూట్ మీద ధూళిపరవకుండా జాగ్రత్తగా పేవ్ మెంటుమీద నడుస్తున్నాను. రకరకాల స్త్రీ పురుషులు బజారునిండా కిలకిల్లాడుతూ ఆ సాయంత్రంపూట ఆ బజారుకి ఒక వింత శోభ నిస్తున్నారు. అయ్యరు హోటల్లోంచి దూసుకొస్తూ వున్న వివిధ పదార్థాల వింత వింత వాసనలు నాసికా పుటాలనుంచి దూసుకుపోయి మనస్సును ఆ వైపుకి లాగుతున్నాయి. కాని అక్కయ్య పెట్టిన అమృత సమానమైన అన్నం అవేమీ అక్కర్లేదని నిరూపించగా ముందుకు సాగాను.

మునిసిపల్ పార్కుదాకా అలా సాగిపోయేసరికి వెధవ సినిమా రేపుచూడవొచ్చును లెమ్మనిపించింది. ఏంచేద్దామా అని అలా సందిగ్ధావస్థలో సతమతమవుతూ వుండగా నా కెదురుగా ఒక జంట దూసుకువొస్తోంది. టకప్ చేసి ఠీవిగ నడుస్తున్నా డతడు. బిరుసైన వెంట్రుకలు నిగనిగ లాడుతూ నల్లగా వింతశోభ నిస్తున్నాయి. మడత నలగని పాంటూ, స్నైక్స్‌బూటూ అతనికి మరింత అందం ఇస్తున్నాయి. ప్రక్కన వాళ్ళావిడ కాబోలు, పచ్చగా సన్నగా వుంది. ఎర్రని పెదిమలూ, పద్మాల్లాంటి విశాల నయనాలూ. కాన్వాసు చెప్పులు యెర్రటి సన్నటి పాదాలకి వింతశోభ నిస్తుండగా గాలికి యెగిరే కుచ్చెళ్ళు పిరుదుల కొక వింతశోభ నిస్తుండగా భర్త కేదో కబుర్లుచెబుతూ అతని చూపుల్లో చూపులు నిలుపుతూ మధుర మందహాసద్యుతులతో అతని గంభీరవదనంలో చిరునవ్వు మొలిపిస్తోంది. నాలుగేళ్ళ అందాల బాలిక —

వాళ్ళమ్మాయి కాబోలు—ఇద్దర్నీ చెరో చేత్తో పట్టుకొని మధ్యమధ్య యెగురుతూ వొస్తోంది.

ఆ సాయంత్రపు సంధ్యారాగంలో ఈ దృశ్యం చూసేసరికి నా మనస్సులో యేదో వెలితిగా వున్నట్టు తోచింది. అంతవరకూ నా అంతి డు లేడని యెగసిపడుతూ, మింటిలో మెరవని తారల్ని—కనపడకపోయినా—లెక్కింపజేసిన దిటవైన నా గుండె నీరుగారిపోయింది; వికలమైపోయిన మనస్సుకి కాస్త విశ్రాంతి నిద్దామని అలా పార్కులోకి అడుగు పెట్టా .

వరసతప్పని క్రోటన్స చిరుగాలికి చిన్నగా తలలూపుతున్నాయి. అక్కడక్కడా నాటిన పూలమొక్కలు వింత వాసనలు వెదజల్లుతున్నాయ్. ఎదురుగా పౌంటెన్‌లోంచి వలయాకారపు నీటిజల్లులు విరజిమ్మబడుతున్నాయి. ఆలోచనలు ఆవరించగా యెదురుగా, ఒక సిమెంటుబల్లమీద కూలబడ్డాను.

అలా ఆలోచనల్లో యెంతసేపు కూచున్నానో తెలీదు. ఇంతలో అవ్యక్తమధుర కాకలీ స్వరాన్ని పోలిన ఒక పిలుపు విని ఉలిక్కిపడి కళ్లువిచ్చి చూశాను. ఎదురుగా పదహారేళ్ళ జవ్వని గులాబీమొగ్గ రేకులు విచ్చుకున్నట్లు యవ్వనం ఆమె సర్వాంగాల్లోనూ ప్రతిబింబిస్తున్నది. ఉల్లిపొరలాంటి వాయిల్ చీరలోంచి అడుగునలంగా, వెల్వెటు జాకెట్టూ కనబడుతున్నాయి. పైన ఆకాశంలో చంద్రుడు వెన్నెల విరజిమ్ముతున్నాడు. రేడియోలో సన్నగా ఎవరో పాడుతున్నారు.

పక్కన యెవరో ఉన్నట్టున్నారు. కుర్రాడులా ఉన్నాడు ఏదో మారాం చేస్తున్నాడు. మాటలు అస్పష్టంగా వినపడుతున్నాయి. మనస్సులో మధువు మరులు రేకెత్తించింది.

"వద్దు బాబూ! అక్కడ ఎవరో ఉన్నట్టున్నారు" ఆమె అంటోంది. "ఊహూ అక్కడికే వెడదాం. అక్కణ్ణించి రంగురంగుల నీళ్ళ జల్లుల్ని చూడవచ్చు" "ఇక్కడ చూడమ్మా! పచ్చిక ఎంత అందంగా ఉందో" కుర్రాడు మారాం ఆగలేదు. చివరికి ఆవిడికి వాడిమాట వినకతప్పలేదు. ఎక్కడికెడతారో మరి!—? నేను కూచున్న బెంచీవద్దకే వచ్చారు వాళ్లు. సంతోషంతో చప్పట్లుకొడుతున్నాడువాడు. తను ఆ చివర కూచుని వాణ్ణి మా ఇద్దరిమధ్య కూచోబెట్టిందామె. గబుక్కున ఆ కుర్రాణ్ణి ఎత్తుకుని ముద్దెట్టుకుందామనిపించింది.

సంభాషణ సాగుతోంది. "అక్కా! ఇంటికెడదామే" అంటున్నాడు వాడు. "బాబూ! వీడు శనిలాగ మాటాడుతున్నాడు" క్షణం నా గుండె కొట్టుకుంది. ఆవిడ ఏదో అంటోంది. "కాసేపు కూచుని పోదాం బాబూ!" అమృతం వరించినట్టయింది. ఆమె మాటాడుతూంటే భాగీరథిలో స్నానంచేసినట్టనిపించింది. మెత్తని మనసుతో మధువు చిలకరించినట్టయింది.

ఉన్నట్టుండి వాడి మనసు యింకోవేపు తిరిగింది. అక్కా! సోడా తాగుతానే!" డబ్బులు లేనట్టున్నాయ్. ఆమె మొహం కొద్దిగా ఎర్రబడింది. "బాబూ ఇంటికెడదాం తరు

వాత తాగుదుగాని" నా గుండెగుభేలుమంది! సిగ్గుగా రెప్పల్ని పైకెత్తి ఒకసారి చూసింది నా కళ్ళల్లోకి— వెళ్ళడాని కిష్టం లేనట్టుంది. శిరజ్జోత్స్నతో సంపెంగపూవుని జ్ఞాపకం చేసింది. ఆ పూవుల వాసనాలహరి. చటుక్కున లేచాను. అంత ధైర్యం యెక్కణ్ణించి వచ్చిందో మరి. ఏదో మాట్లాడదామని పెనుగులాడుతున్నది మనస్సు పెదిములతో. నోరు పెగిలిరావడంలేదు. గబగబా కుర్రాడిదగ్గిరికెళ్ళి "రా బాబూ నే కొనిపెడతాను" అని చెయ్యిపుచ్చుకున్నాను. ఏమనుకున్నాడో మరి వెంటనే వచ్చేశాను. సిగ్గుచేతకాబోలు — అని నే ననుకొన్నాను. ఆమె ఏమీ మాటాడలేదు.

పక్కన షాపులో ఒక సోడా యిప్పించి, బిస్కట్లూ, బిళ్ళలూ కొన్నాను. "ఎవరు బాబూ ఆ అమ్మాయి" అడిగా చిరునవ్వు తెప్పించుకొని. "అక్క" అని నాకేసి నవ్వాడు. కొంచెం ధైర్యం వచ్చింది. "పేరు?" అడిగాను. "పద్మావతి" పద్మావతి! యెంత చక్కని పేరు! వెధవ!—? వచ్చాక చెప్పేశాడు ఆ సంగతి కాస్తా. నేను ఆవిడ పేరడిగినట్టు. గుండె గుబగుబలాడింది! చెప్పాకి పనితగులుతుందేమోనని భయపడ్డాను. కానీ—! ఆవిడ నవ్వింది. ఎంతచక్కని నవ్వు! సన్నని లేత తుని తమలపాకులాంటి ఆ పెదవి పట్టువుగావొంచి మందహాసం చిందిస్తుంటే వెన్నెల వెలుగులు తెల్లటిదానిమ్మ గింజల్లాంటి ఆమె దంతాలపై మెరిసి ప్రతిఫలించాయి. ముందు ఆవిడే మాటాడింది.

క్షమించండి అనవసరంగా శ్రమపడ్డారు. మా వాడి కోసం" ఫరవా లేదు ఏదో పిల్లలంటే సరదా నాకు" నసిగాను. "ఏ పిల్లలు ఆడపిల్లలా లేక—" సిగ్గుపడ్డాను! తలెత్తి ఆమె ముహంలోకి చూశాను. నావంకే చూస్తోంది! ఆమె నవ్వలే లేదు. కాని నవ్వుకంటే గంభీరమైనదేదో ఆమె పెదవులపై లాస్యంచేస్తోంది. "క్షమించండి! యిందాక ఏవో ఉబుసుపోక అడిగాను మీ పేరు కుఱ్ఱాడ్ని. "ఫరవా లేదు అలా అడగటంలో తప్పేంలేదనే నా ఉద్దేశ్యం." "మీరు కాబట్టి సరిపోయింది. లేకపోతేనా"..."మీ మగవాళ్ళంతా యింతే. ఏదో చేస్తారు. చేసినదాన్ని ధైర్యంతో చేయలేరు. పైగా సిగ్గుపడతారు."

ఆమె అంత చొరవగా మాట్లాడుతోంటే నోరు తెరచుకొని వింటూ వుండిపోయాడు తల్లి యెదుట తప్పుచేసిన పిల్లవాడు నిలబడినట్టుగా. లోకువ అయినందుకు విచారిస్తూ సగం సంతోషిస్తూ. "అక్కా, అక్కా అటుచూడు" చంద్రుడుకేసి చూపించాడు వాడు. "వెన్నెల బావుంది కదూ" అడిగిందామె నా కళ్ళల్లోకి చూస్తూ. సిగ్గుపడ్డాను. "ఊ" అన్నాను తడబడుతూ. నవ్విందామె. అమృతం కురిసినట్లయింది ఆ చూపుల చల్లదనానికి. ఆ కళ్ళల్లో ఏదో వింతకాంతులు కనిపించాయ్ నాకు. అడిగాను "మరి చంద్రుడో" "అహా" "పూలు" నిజమే! "ఎక్కడివి" "మీ తలలోని" "నిజంగా" పగలబడి నవ్విందామె. నవ్వలేక నవ్వాను నేను. ఆమెతలలో పూలు విరగబడి నవ్వాయి.

కుర్రాడు మారాం చేయసాగాడు. ఇంటికి పోదామని? వెళ్ళటానికికాబోలు లేచింది. "రేపు వస్తారుగా!" ఖచ్చితంగా వస్తానని తెలిసినట్లు మాటాడింది. "ఆ" లేవలేక కూర్చునే అన్నాను. నడిచి వెళ్ళిపోయింది హంసలా. నడుస్తోంటే వెన కాల పిరుదలు సముద్ర తరంగాల్లా వూగాయి. వెన్నెల కెరట్లు కెరట్లుగా తేలుతూ పోయినట్లనిపించింది. క్షణంలో అంతా నిశ్శబ్దం. తరువాత యింటికి వొచ్చేశాను బరువైన గుండెని చేత్తో పట్టుకుని.

మర్నాడు కూడా వెళ్ళాను అక్కడికి. క్రితం రోజు లాగే సాగింది సంభాషణ. ఇలా ఈ వారంరోజులనుంచీ కలుసుకుంటూనే ఉన్నాం. నిన్న ప్లెయిన్‌గా చెప్పేశాను ఆమెకి నా మనస్సులో అభిప్రాయాన్ని. ఆమె నిర్మల హృద యాన్ని ఆరాధించి ధన్యుణ్ణవ్వాలని నా గాఢ వాంఛ. అడి గితే ఎడ్రసు చెప్పింది. పెళ్ళిమాత్రం చేసుకోవాలని తన కింతవరకూ కలుగలేదట. అయినా, ఆ విషయాన్ని గురించి సరిగ్గా మాటాడుకుందామని యివ్వాళ నన్ను వాళ్ళింటికి రమ్మన్నది. మన మిద్దరమూ వెళ్ళి చూసివద్దాము. కట్నం, కానుకలూ, కులం, గోత్రం యివన్ని నా కనవసరం. ఆమె నచ్చింది. నాకా భుక్తికి లోపం లేదు సరికదా నా సంపాద నతో పదిమందిని పోషించగలను. "ఏమంటావు బావా?" అడిగాడు మావాడు.

"సరే! వస్తారులే సాయంత్రంవెళ్ళి పిల్లను చూసిరండి

ఇద్దరూ!" అన్నది మా ఆవిడ. నాకు చిర్రెత్తుకొచ్చింది. "సరి పోయింది ఇద్దరికీ. వెర్రినాగమ్మలు కట్నంలేకుండా చేసుకుంటానంటే నాకభ్యంతరంలేదు. కానీ వెర్రినాగమ్మా! కులం గోత్రం లేకుండా పెళ్ళిచేసుకుని రేపు పొద్దున్న కన్న సంతానాన్ని ఏ ఏట్లో పారేస్తావోయ్?" అరిచాను నేను కోపంతో.

కొంచెం తగ్గాడు మావాడు. సరే ఆ సంగతి తరవాత అడిగి తెలుసుకోవచ్చు. ముందు యిద్దరూ వెళ్ళి పిల్లని చూసి రండి. అప్పుడే తెలుస్తాయిగదా అన్నివిషయాలూ" సజెస్టు చేసింది శ్రీమతి.

సరే ఆ సాయంత్రం అభినవ, అపర ప్రవరాఖ్యుడు అని మా ఆవిడచేత అనబడే హీరో అయిన మా బావమరిదిని వెంటబెట్టుకొని ఆ అడ్రసు ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాను.

ఇల్లు సింపిల్‌గా ఉంది. నేనెప్పుడూ ఆ పరిసరాలకి వెళ్ళకపోవటంవలన ఆ ప్రాంతముయొక్క మంచి చెడ్డలు నాకు తెలియలేదు. వరండాలో నాలుగైదు కుర్చీలు వరసగా అమర్చబడి వున్నాయి. సరే కుర్చీల్లో కూర్చుని లోపలికి కబురంపించాం. లోపల్నించి వినబడుతోంది ఆవిడేకాబోలు. గొంతు తియ్యగావుంది. "ఏమిటనుకున్నావ్ మరి?" అన్నట్లు నాకేసితిరిగి గుటకలు మింగాడు మావాడు. "వారేనే! నీతో చెప్పానే నిన్న వెళ్ళి మాట్లాడు" లోపల్నించి వొచ్చిందో ముసలావిడ తాంబూలపుపళ్లెం టేబులుమీదపెట్టి అన్నది.

"నాయనా మీరు వస్తారని అమ్మాయి చెబుతూనే ఉన్నది. మీరు వస్తారని ఎంత సంబరపడిందనుకున్నారు?" "ఏమిమర్యాద! ఏమిమర్యాద!! నిజంగా మా వాడు అదృష్ట వంతుడే! ఏరి ఏరి స్వయంవరంలో చివరికి మంచి సంబంధం పట్టాడు" అనుకున్నాను తాంబూలాలు నములుతూ. మావా డిక్కడ ఉన్నట్టు లేడు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఇంతకీ ఇద్దరిలో ఎవరికీ! మీ పుణ్యమూ అని దాని కన్నె చెర తప్పించాలంటే బాబూ! నాలుగురాళ్లు నాకు తెస్తుంది. వాళ్ళూ వీళ్ళూ వస్తూనేవున్నారు. నాలుగయిదు వేలు యిస్తామని. కానీ చూస్తూ చూస్తూ బంగారుతల్లిని కుంటివాళ్ళ చేతులో పెడతానా? బయానా ఏమయినా తెచ్చారా నాయనా?

"ఆ" నోరు తెరిచాను. కళ్ళుమూసుకుని ఉన్న మా వాడి వీపుమీద ఓ చరుపు చరిచి "క్షమించాలి! పొరబడి మీ యింటికొచ్చాము. మీకు కావలసినవాళ్ళం మేము కాదు" అని బయటికి వొచ్చేశాను మా వాడిని రెక్కపట్టిలాక్కొస్తూ.

"ఏమిటి బావా ఏం జరిగింది? గాబరాగా అడిగాడు మా వాడు బయట. "ఏమిటా నువ్వు వలచినది సాక్షాత్తూ ఆ రంభని సుమా!" అరిచానుకోపంతో. "కాదనిఎవరన్నారు ఏమిటీ ఆదుర్దా. ఆవిడేమన్నా అనుకుంటుంది అసలు సంగ తేమిటి బావా!" అన్నాడు వాడు గాభరాగా.

"నా చిట్టి తండ్రీ! నువ్వు ప్రేమించింది ఒక పడుపు పడుచుని అన్నాను. "ఆ" అని నోరు తెరిచి పడిపోయిన మా

వాడిని మెల్లిగా ఇంటికి చేర్చాను రిక్షామీద అతి కష్టంగా. ఇంటికెళ్ళిన తరువాత మా హీరోనిస్థితిచూచి మాఆవిడ గాబరా పడింది. సంగతి తెలుసుకున్నాక "పేనుకు పెత్తనం యిస్తే తలంతా చెడకొరికిందట! వీరు పెత్తనానికి బయలుదేరి నపుడే అనుకున్నాను. ఏదో జరుగుతుందని" అని ఓరిమార్కు-పారేసింది. ఏమనటానికీ తోచక నిలువుగుడ్లు వేసుకుని అలా ఆమె మొహంలోకి చూస్తూవుండిపోయాను. అంతకంటే ఏం చేయను గనక?